# శ్రీ సుబ్రహ్మణ్య వైభవం

బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు శర్మ

ప్రవచనం

ఎమెస్కో

# శ్రీసుబ్రహ్మణ్య వైభవం

సుబ్రహ్మణ్య అవతారం ఎంత ఉత్కృష్టమైనదంటే ఆ స్వామి అవతరించడంకోసం ముప్పైమూడు కోట్లమంది దేవతలూ కన్నులు కాయలుకాచేటట్లు ఎదురుచూశారు. వాల్మీకి మహర్షి శ్రీమద్రామాయణాన్ని 24000 శ్లోకాలలో రచించారు. అంత చెప్పిన మహర్షి రామాయణంలో ఏ ఘట్టానికీ కూడా ఫలశ్రుతి చెప్పడానికి ఇచ్ఛగించలేదు. కొన్ని సందర్భాలకి మాత్రమే ఫలశ్రుతి చెప్పారు. అలా చెప్పినవాటిలో శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి జననం ఒకటి.

కుమారసంభవరచన జరిగినప్పటి కాలం నుండి ఇప్పటికీ పెద్దలు షణ్ముఖోత్పత్తిపారాయణ చేయవలసి వస్తే బాలకాండలో చెప్పిన షణ్ముఖోత్పత్తినే పారాయణ చేస్తారు, ఈ వృత్తాంతం వినడమెంత గొప్పదంటే, జన్మజన్మాంతరపాపాలను అనుభవించడానికి జన్మించే శిశువు, తల్లి గర్భం లోపల పిండంగా ఉన్నప్పుడు కూడా సంస్కరించే శక్తి కలిగిన ఏకైక ఆఖ్యానం. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఉత్పత్తి ఒక్కటే అటువంటిదని పెద్దలు చెప్పారు. అందుకే ఇప్పటికీ గర్భిణులు సుబ్రహ్మణ్యోత్పత్తిని వింటారు. కొంత సంస్కృతం తెలిసినవారు, బాలకాండలోని ఆ షణ్ముఖోత్పత్తిని – రెండు–మూడు సర్గలలో

ఉన్న ఆ విషయాన్ని – పారాయణ చేస్తారు. ఇప్పటికీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వైభవానికి లోకంలో ఎంత ప్రాధాన్యం ఉన్నదంటే వ్యాధులను నయం చెయ్యడం దగ్గరి నుంచి సంచితంగా వస్తున్న పాపాల రాశిని దగ్ధం చేసేవరకు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వైభవం వినడం, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి స్తోత్రాన్ని చదవడం విశేషమైన ప్రాధాన్యాన్ని సంతరించుకున్నాయి.

సుబ్రహ్మణ్యోత్పత్తికి ముందు చాలా నేపథ్యం నడిచింది. పరదేవత యందు విశేషమైన లక్షణం ఒకటి ఉంటుంది. ఆమె మహాపతివ్రత. ఆమె ఎన్నడూ కూడా భర్తను విడిచిపెట్టి ఉండేది కాదు. ఎప్పుడెప్పుడు భగవంతుడు అవతారస్వీకారం చేస్తే, అప్పుడప్పుడు తల్లి కూడా అవతారస్వీకారం చేస్తుంది. ఆమె ఎంతమందికైనా కుమార్తెగా వస్తుంది. అసలే కుటుంబంలో ఆడపిల్ల ఉన్నా ఆమె పరదేవత స్వరూపిణే. అందుకే రామాయణంలో కన్యాదానం చేసేటపుడు వాడే శ్లోకం, ఈ లోకంలో ఎవరు, ఎప్పుడు కన్యాదానం చేసినా వాడవలసిన మాటలతో కూడుకున్నదై ఉంటుంది. అటువంటి అమ్మవారు ఎంతమందికైనా కూతురుగా రావడానికి అంగీకరిస్తుంది. ఆమె ఎందరినో తరింపజేయడానికి వాళ్ళకి కూతురుగా వచ్చింది. ఒకప్పుడు కాత్యాయనమహర్షికి కూతురై కాత్యాయనీహైమవతి అయినది. కాని ఎన్ని అవతారాలు స్వీకరించినా ఆమెకు భర్త మాత్రం పరమేశ్వరుడే. అక్కడే పురుషుడైనా నిలబడితే అమ్మవారి కళ్లలో రౌద్రరసం కనపడుతుందని చెప్పారు శంకరాచార్యులవారు.

అమ్మ కళ్లెప్పుడు ఎందుకు ఎరుపెక్కుతాయంటే, నేను మగవాడిని అన్న భావనతో ఎవరయినా పరదేవత ఎదురుగా నిలబడితే 'శివే శృంగారాతదితరజనే కుత్సనపరా' అన్నారు. అమ్మా! నేను నీ కుమారుణ్ణి. అమ్మా అనే భావనతో నిలబడినవారిని చూస్తే అమ్మ కళ్లనుండి కారుణ్యమొలుకుతుందట. అటువంటి తల్లి భక్తికి పరవశించిపోయి అవతారస్వీకారం చేసింది. ఆర్షసంప్రదాయంలో

అమ్మవారు అత్యంతబాధతో అవతారసమాప్తి చేసిన ఘట్టం ఒకటుంది. అదే సతీదేవిగా. ఆమె అలా అవతారపరిసమాప్తి చెయ్యడానికి కారణం భర్తను తన తండ్రి నిందించడమే. మహాత్ములైన వారికి పరమేశ్వరునితో దేహ బంధుత్వం ఎందుకు కలుగుతుందంటే, ఆ తల్లి ఒకరికి కూతురుగా వచ్చింది కాబట్టి, ఆ కూతురికి తండ్రి అనిపించుకున్నవాడు పరమేశ్వరునికి కన్యాదానం చేసేయాలి. నేను పరమేశ్వరునికి మామగారిని అని విర్రవీగితే లేనిపోని పోకడలేర్పడతాయి.

దక్షప్రజాపతి విషయంలో అటువంటి ప్రమాదమే ఏర్పడింది. పరమేశ్వరుడు నా అల్లుడు కాబట్టి నన్ను చూస్తే లేచి నిలబడాలి. నమస్కారం చెయ్యాలి – అని దేహబంధుత్వాన్ని గురించి ఆలోచించాడు తప్ప, పరమశివుని వైభవాన్ని, అల్లుడవడానికి కారణం పరదేవత తనను అనుగ్రహించి తనకు కుమార్తెగా అవతరించిందన్న విషయాన్ని విస్మరించాడు. ఈ క్రోధం కడుపులో ఉన్న కారణంగా దక్షప్రజాపతికీ, పరమశివునికీ వైరం ప్రబలింది. పరమశివునికి ఎన్నడూ, ఎవరితో వైరం పెట్టుకునే మనస్తత్త్వం ఉండదు. లోకానికి తండ్రి అయినవానికి అక్కరలేని భావాలన్నీ ఎందుకు చేరుతాయి? కానీ పరమేశ్వరుణ్ణి ఎలాగైనా అవమానించాలని అనుకున్న దక్షప్రజాపతి, నిరీశ్వరయాగం చేసాడు. ఈశ్వరునికి హవిస్సు లేకుండా నేను యజ్ఞాన్ని చేస్తానన్నాడు. భర్తను నిగ్రహించి నేను వెళ్ళితీరుతానని అనేకధర్మపన్నాలు చెప్పి అమ్మవారా యజ్ఞానికి వెళ్లింది. పైకి చూడడానికి భర్త వద్దు, అవమాన పడతామని చెప్పినా ఎందుకు వెళ్ళిందని అనుమానం వస్తుంది. కాని యజుర్వేదంలో దానికి సంబంధించిన ఒక రహస్యం చెప్తారు.

'శివా విశ్వస్య భేషజీ శివా రుద్రస్య భేషజీ' – లోకం తప్పు మార్గంలో నడుస్తుంటే అమ్మవారు లోకాన్ని రక్షించడానికి శివుణ్ణి రుద్రుణ్ణి చేస్తుంది. లోకంలో కూడా తల్లి తన బిడ్డలు తప్పు మార్గంలో పోతున్నప్పుడు, తన

భర్తను బాగా ఉత్తేజం పొందేటట్టు బిడ్డలు చేసే దోషాలు చెప్పి, తండ్రికి కోపం వచ్చి బిడ్డలను నాలుగు దెబ్బలు కొట్టేట్టుగా చేస్తుంది. అలా చేస్తే తప్ప బిడ్డలు సక్రమమైన మార్గంలో ఉండరు. తండ్రికి కోపం రావడానికి కారణం అమ్మే. మళ్ళీ ప్రసన్నుడవడానికి కారణమూ ఆమే. అదే పాత్ర విశ్వమంతటికీ తల్లిదండ్రులుగా –

**వాగర్థావివసంపృక్తౌ వాగర్థ ప్రతిపత్తయే ।**
**జగతః పితరౌ వందే పార్వతీపరమేశ్వరౌ॥**

అందుకే అమ్మవారు శివుడు కాదంటున్నా యాగానికి వెళ్ళి ఆయన్ని సూటిగా ప్రశ్నవేసింది. నీ బాధంతా ఏమిటి? పరమశివుడు పూజార్హుడు కాదు, అందుకని నేను ఆయన్ను ఆహ్వానించనని అంటున్నావు.

**పరగ చితాస్థిభస్మ నృకపాల జటాధరుడుం బరేతభూ**
**చరుడు పిశాచయుక్తు డని శర్వు నమంగళుగా దలంప రె**
**వ్వరు నొక డీవు దక్కమఱి వాక్పతిముఖ్యులు నమ్మహాత్ము స**
**చ్చరణ సరోజరేణువులు సమ్మతి దాల్తురు మస్తకంబులన్.**

(భాగ. 4-89)

ఏమయ్యా! శివుడు పూజనీయుడు కాదు, ఎక్కడో శ్మశానంలో ఉంటాడంటున్నావు. అది నిజమైతే చతుర్ముఖబ్రహ్మ కూడా పరమశివుని పాదాలకంటుకున్న రేణువులను తీసి తన తలలపైన ఎందుకు చల్లుకుంటున్నాడు? నిన్ను కన్నవాడు బ్రహ్మ. వారే శివుని పాదరేణువులను కిరీటం మీద చల్లుకుంటుంటే, నీకేర్పడిన అభ్యంతరమేమిటి?

ఆయన శ్మశానంలో ఉండడానికి కారణం వేరు. అనుశాసనికపర్వంలో చెప్పారు. లోకంలో అహంకారం చూపించి బ్రతికినవాడు శరీరం విడిచినప్పుడు, చిట్టచివర ఒక్కణ్ణీ తీసుకెళ్ళి శ్మశానంలో దహనం చేస్తే,